హెచ్‌ఎం అసభ్య ప్రవర్తనపై డిఇఒ విచారణ


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డిఇఒ

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మొగిలీశ్వరయ్య బాలికల పట్ల సభ్య ప్రవర్తన చేస్తున్నారని పిల్లల తల్లిదండ్రుల ఆరోపణపై సస్పెండ్ చేశారు. సోమవారం అన్నమయ్య జిల్లా డిఇఒ రాఘవరెడ్డి హెచ్‌ఎం అసభ్య ప్రవర్తన తీరుపై విచారణ చేశారు. ఎంఆర్‌సి కార్యాలయంలో పిల్లలు తల్లిదండ్రులతో విచారించారు. అనంతరం పాఠశాలలను సందర్శించారు. పిల్లలతో జరిగిన విషయాలపై విచారించారు. అనంతరం తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ నీలోఫర్, ఎంఇఒ త్యాగరాజు ఉన్నారు.

వైసిపి ప్రభుత్వంలో బిసిలకు తీరని అన్యాయం

- అధికారంలోకొచ్చాక న్యాయం చేస్తాం
- కడప 'ఉక్కు'కు శంకుస్థాపనలతోనే సరిపెట్టారు
- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

బిసిల ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-పీలేరు

వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలోని బిసిలకు తీరని అన్యాయం చేస్తూందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 36వ రోజుకు చేరుకుంది. సోమవారం వేపుల బయలు నుంచి ప్రారంభమైన పాదయాత్ర అంకాళమ్మగుడి దేవాలయం, బోడి పురం, తిమ్మిరెడ్డిగారిపల్లి, కొత్తకుంట పట్టికాల నుంచి కలికిరి మండలంలోని సత్యపురంలోకి ప్రవేశించింది. నగిరిపల్లె క్రాస్, కలికిరి ఇందిరమ్మ కాలనీ వరకూ పాదయాత్ర సాగింది. మండలంలోని వేపుల బైలు గ్రామ సమీపంలో కిషోర్ కుమార్‌రెడ్డి విల్లాపై వేదిక బిసి రాష్ట్ర కార్యదర్శి పురం రామ్మూర్తి, వసంతల రాజా అధ్యక్షతన యువ నేత నారా లోకేష్ బిసిలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ప్రభుత్వంలో బిసిలకు జగన్మోహన్‌రెడ్డి అన్యాయం చేశారన్నారు. బిసి కార్పొరేషన్ నిధులు పక్కదారి పట్టించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువు చేశారని ఆరోపించారు. కార్పొరేషన్ కార్యాలయంలో చైర్మన్ కూర్చోడానికి కనీసం కుర్చీ కూడా లేదని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ హయాంలో బిసిలకు కేబినెట్ హోదా కల్పిస్తూ సముచిత స్థానం కల్పించామని గుర్తు చేశారు. తాము తిరిగి అధికారంలోకి వచ్చాక బిసిలకు కచ్చితంగా న్యాయం చేసే బాధ్యత తాను తీసుకొంటానని లోకేష్ బిసి సోదరులకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు బిసి సంఘాల నాయకులు, ప్రజలు అడిగిన ప్రశ్నలకు లోకేష్ సంతృప్తికర సమాధానాలు ఇచ్చారు. పాదయాత్ర ప్రారంభానికి ముందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అనేక పరిశ్రమలు వచ్చాయన్నారు. గడచిన నాలుగేళ్లలో వైసిపి ప్రభుత్వ నిర్లక్ష్యంతో జోగుతోందన్నారు. వైసిపి పాలనలో పెద్దఎత్తున పిపిఏలు రద్దు చేసి అనేక పరిశ్రమలను ఏపి నుంచి తరిమేశారని విమర్శించారు. జగన్ సిఎం అయ్యాక ఫ్రాంక్లిన్ టెంపుల్టన్, లులూ, హోటల్, అమర్ రాజా, మోనిక్ పార్క్, జాకీ, ఏషియన్ పేపర్ పల్ప్ కంపెనీలు పారిపోయాయన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య మూడు రెట్లు పెరిగి 13.5 శాతానికి పెరిగిందని చెప్పారు. గంజాయి సరఫరాలో మాత్రం ఏపి మొదటి స్థానంలో ఉందని తెలిపారు. కడప స్టీల్ ఫ్యాక్టరీకి ఇప్పటికి జగన్ పలుమార్లు శంకుస్థాపనలు చేశారని, వసులు ప్రారంభం కాలేదని, ఉపాధి అవకాశాలు ఎలా వస్తాయని మరో ప్రశ్నకు సమాధానం చెప్పారు. సరస్వతి సిమెంట్స్ పేరుతో ప్రభుత్వ భూములు తీసుకుందని, నేటికీ పరిశ్రమ రాలేదన్నారు. 175 సీట్లు వస్తాయంటే జగన్ పరదాలు కట్టుకుని ఎందుకు దాక్కుని తిరుగుతున్నాడని, తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చుని బటన్ నొక్కడం ఎందుకు? జిఒ-1 ఎందుకు తెచ్చారని ప్రశ్నించారు. టిడిపి, జనసేన కలిసి పోటీచేస్తాయని మేం ఎప్పుడైనా చెప్పామా? వాళ్లు మేం ఎక్కడ పోటీ చేయాలో నిర్ణయిస్తే మేం పోటీ చేయాలా? ఎన్నికల సమయంలో అప్పటి పరిస్థితులను అనుసరించి మా రాజకీయ వ్యూహాన్ని అమలు చేస్తామని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎన్.అమర్‌నాథ్‌రెడ్డి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ బాధ్యులు చల్లా రామచంద్రారెడ్డి, దూళిపాళ్ల నరేంద్ర, ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి, బిసి నాయకులు పురం రామ్మూర్తి, వసంతల రాజా, సోర్పిల్ మల్లి పాల్గొన్నారు.

టిడిపిలో చేరిన వైసిపి సర్పంచ్

కలికిరి: జాతీయ టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆధ్వర్యంలో కలికిరి మేజర్ పంచాయతీ వైసిపి సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్‌రెడ్డి టిడిపిలో చేరారు. లోకేష్ యువగళం పాదయాత్ర కలికిరికి చేరుకున్న సందర్భంగా కలికిరి క్రాస్ రోడ్డు వద్ద ఆయనకు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం కలికిరిలో జరిగిన బహిరంగ సభలో కలికిరి మేజర్ పంచాయతీ సర్పంచ్ రెడ్డివారి ప్రతాప్ కుమార్‌రెడ్డితో పాటు మహల్ మాజీ ఎంపిటిసి సతీష్‌రెడ్డి, మున్నేలపల్లి బిసినాయకుడు రవితోపాటు పలువురు వైసిపి నాయకులు, ముస్లిం మైనార్టీ నాయకులు 1500 మంది లోకేష్ చేతులు మీదుగా టిడిపి కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైసిపిలో నాయకులకు కనీస గౌరవం లేదని, మండలంలో నాయకులు సిండికేట్‌గా మారి ఇసుక మాఫియాగా ఏర్పడి ప్రభుత్వ సొమ్మును కోట్ల రూపాయలు దోచేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి సారథ్యం కలికిరిలో తెలుగుదేశం మీటింగ్ పెట్టించి నేనని మళ్లీ తెలుగుదేశం పార్టీలోకి రావడం గర్వంగా భావిస్తున్నానని తెలిపారు. అనంతరం లోకేష్ మాట్లాడుతూ గతంలో నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి పెట్టిన ఖర్చులో 10 శాతం కూడా ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి నియోజకవర్గానికి ఖర్చు పెట్టలేదని, వైసిపి పాలనలో ఏ రకంగా అభివృద్ధి చేసారో ఎంపి, ఎమ్మెల్యే చెప్పాలని నిలదీశారు. నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ప్రతాప్ కుమార్‌రెడ్డికి ఎన్నో అవమానాలు జరిగాయని, గతంలో మాకు రాజకీయంగా పోటీ ఉన్నా అభివృద్ధి విషయంలో రాజీ పడలేదని, ఆయన తెలుగుదేశం లోకి రావడం పై ఆనందం వ్యక్తం చేశారు.

సర్పంచ్ ప్రతాప్‌రెడ్డికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేష్

మండలి ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పోలా భాస్కర్, ఎం.హరి జవహర్ లాల్

మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పోలా భాస్కర్

ప్రజాశక్తి - కడప

శాసనమండలి ఎన్నికలను ప్రశాంతంగా, పకడ్బందీగా, ప్రణాళికాబద్ధంగా నిర్వహించాలని ఎన్నికల పరిశీలకులు డాక్టర్ పోలా భాస్కర్, ఎం.హరి జవహర్‌లాల్ నోడల్ అధికారులను ఆదేశించారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకులు వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు, జెసిలతో కలసి నోడల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు వి.విజయ్ రామరాజు, గిరీషా పి.ఎస్.లతో పాటు ఎస్‌పిలు అన్బురాజన్, హర్షవర్ధన్‌రాజు, జెసి సాయికాంత్ వర్మ, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, అన్నమయ్య డిఎఫ్ఓ వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళి పక్కాగా అమలవ్వాలని, జిల్లాల్లో ఇప్పటికే ప్రకటించిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మెటీరియల్ చెక్ లిస్టు ఆధారంగా పోలింగ్‌కు రెండు రోజుల ముందే చేరుకొని ఏర్పాట్ల సరిచూసుకోవాలని తెలిపారు. పోలింగ్ రోజు పోలీస్ భద్రత, ప్రిసైడింగ్ అధికారి డైరీ నిర్వహణ, ప్రశాంత పోలింగ్ నిర్వహణ, ఓటరు గుర్తింపు కార్డుతో ఓటు హక్కు వినియోగం, సూక్ష్మ పరిశీలకుల నివేదిక, వెబ్ కాస్టింగ్ / వీడియో నిర్వహణ, పరిసరాల్లో ఎలక్షన్ కోడ్ అమలు, పోలింగ్ ముగింపు తర్వాత బ్యాలెట్ బాక్సుల భద్రత, ఓట్ల లెక్కింపు వంటి అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్షించారు. స్థానిక పరిస్థితులను బట్టి ఎక్కడా ఎటువంటి సమస్య లేకుండా ఎన్నికలు జరిగేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అంతకు ముందు వైఎస్ఆర్ జిల్లా ఎన్నికల అధికారి వి.విజయ్ రామరాజు పిపిటి ద్వారా వివరిస్తూ. ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలను విజవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లను ప్రణాళిక ప్రకారం సంసిద్ధం చేస్తున్నామన్నారు. ఎన్నికల విధుల్లో అనుభవం ఉన్న అధికారులతో ఎటువంటి లోటుపాట్లు లేకుండా ఎన్నికల విధులను చేపడుతున్నామన్నారు. ఇప్పటికే పీవోలు, ఏపీవోలకు, మైక్రో అబ్జర్వర్స్‌కు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చామని చెప్పారు. జిల్లాలో ఇప్పటికే 131 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని ఎన్నికల నిర్వహణ సిబ్బందికి సంబంధించి 191 పీవోలు, 191 ఏపీవోలు, 393 ఓపీవోలను నియమించామని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ కొనుగోలు ప్రక్రియ కూడా జరుగుతోందన్నారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్స్ ను సిద్ధం చేసుకున్నామన్నారు. జిల్లాలో 37 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను కూడా గుర్తించి అదనపు భద్రతా సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. వెబ్ కాస్టింగ్ కోసం ఇంజినీరింగ్ విద్యార్థులను తీసుకున్నామని తెలిపారు. పోలింగ్ మెటీరియల్ రవాణా చేసేందుకు జిల్లాలో 21 రూట్లను ఎంపిక చేశామన్నారు. గట్టి పోలీసు బందోబస్తును సిద్ధం చేసుకున్నామని తెలిపారు. అనంతరం రెండు జిల్లాల నోడల్ అధికారులు వారు నిర్వర్తించే విధులను ఎన్నికల పరిశీలకులకు వివరించారు. సమీక్షా సమావేశంలో వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల ఆర్డీవోలు, జెడ్పి సీఈవోలు, డిపివోలు, ఎన్నికల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

మార్పుకు నాంది పలుకుదాం

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

సమావేశంలో మాట్లాడుతున్న పోతుల నాగరాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఉద్యమ నేపథ్యం కలిగిన నాయకులను గెలిపించుకుని రాష్ట్రంలో మార్పుకు నాంది పలుకుదామని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు తెలియజేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం స్థానిక ఎఐటియుసి కార్యాలయంలో సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్, సిఐటియు, ఎఐటియుసి, వివిధ సంఘాల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అధికార పార్టీ అసెంబ్లీ, పార్లమెంట్లలో సంఖ్యా బలం ఉన్నందున అహంకార ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. పాఠశాలల విలీనం పేరుతో రాష్ట్రంలో సుమారు 12 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేశారని తెలిపారు. చదువుకునేందుకు పిల్లలు రెండు నుంచి మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని, దీనివలన అనేకమంది పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. అధికార పార్టీ ఉద్యోగులను ముప్పు తిప్పలు పెడుతోందని విమర్శించారు. నిరుద్యోగులు ఉద్యోగం మీద ఆశ వదులుకున్నారన్నారు. ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగుల కుటుంబాలను సంక్షోభంలోకి నెట్టివేశారని అన్నారు. అధికార పార్టీ ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టడంలో ప్రతిపక్షం విఫలమైందని, ప్రజల పక్షాన పోరాడకుండా సొంత ప్రయోజనాల కోసం పాకులాడుతూ టిడిపి శిఖండి పాత్ర వహిస్తోందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ వాలంటీర్ల ద్వారా నగదు పంపిణీ చేస్తే.. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కేంద్ర ప్రభుత్వ శాఖను వినియోగించుకుని తపాలా ద్వారా వేయి రూపాయలు నగదు, కరపత్రాలనుపంపిణీ చేస్తూ బహిర్గతమైన విషయం అందరికీ తెలిసిందేనని తెలిపారు. వామపక్ష భావాలు, కలిగి.. ఆరు సంవత్సరాలుగా శాసనమండలిలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల పక్షాన పోరాడిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే పలు సమస్యల పైన పోరాటం చేస్తూ సమైఖ్యాంధ్ర ఉద్యమంలో కటకటాల పాలై మరెన్నో వివిధ రకాల ఉద్యమాలలో నాటి నుండి నేటి వరకు కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ సమస్యల పైన అలుపెరగని పోరాటం చేస్తూ సేవే పరమావధిగా భావిస్తూ అవినీతి రహిత సమాజ స్థాపనకు కృషి చేస్తున్న తనను పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వివిధ రకాల సుమారు 180 పైబడి సంఘాలను కలుపుకొని నిరుద్యోగ యువత కోసం, ఉద్యోగ-ఉపాధ్యాయ హక్కులు, అధికారాలు, ఆత్మగౌరవం, సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులర్, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల టైం స్కేల్ కోసం, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం, పెన్షనర్ల హక్కుల పరిరక్షణ, రాయలసీమ సమగ్ర అభివృద్ధి, వికలాంగుల హక్కుల సాధన, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డిని, తనను గెలిపించి మార్పుకు నాంది పలకాలని కోరారు.

కరపత్రాలు పంపిణీ : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు వివిధ సంఘాల, పార్టీల నాయకులతో కలిసి శ్రీ చైతన్య పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపల్ ఆకేపాటి సుధాకర్‌రెడ్డితో భేటీ అయి ప్రయివేటు ఉపాధ్యాయులతో చర్చించి కరపత్రాలు పంపిణీ చేశారు. తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి చిట్వేలి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, సిపిఐ నాయకులు మహేష్, సికిందర్, శివ రామకృష్ణ దేవర, రాయుడు, కాంగ్రెస్ నాయకులు పూల భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తున్న ఎంఇఒ

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలో ఎస్‌టి కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలను సోమవారం మండల విద్యాశాఖ అధికారి రంగనాథయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎస్‌టి కాలనీ ప్రాథమిక పాఠశాలలో నాలుగు, ఐదవ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ వర్క్ బుక్కుల గురించి ఒకటో తరగతి చదువుతున్న విద్యార్థుల పుస్తకాల గురించి ఆరా తీశారు. పాఠశాలలోని తరగతి గదులను, వంటశాలలను, మరుగుదొడ్లను చుట్టుపక్కల పరిసరాలను పరిశీలించారు. పాఠశాలలో మధ్యాహ్నం భోజనంను తనిఖీ చేశారు. నాడు-నేడు పనుల స్థితిగతుల గురించి అధ్యయనం చేశారు. పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు అడిగి పలు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించకుండా ఉండినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్కూళ్లకు విద్యార్థులకు సంబంధించి ఎటువంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకువస్తే ఉన్నతాధికారులకు చేరవేసి తగిన సహాయ సదుపాయాలు అందిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాల ప్రణాళికలను తగు రికార్డులను ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకుని ఉండాలన్నారు. అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు తగు రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విద్యార్థులకు అర్థవంతంగా పాఠ్యాంశాలను బోధించాలని వివరించారు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతి సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు పొందుపరిచాలని తెలపారు. పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తీసుకు రావాలని విద్యార్థుల విషయంలో ఎల్లవేళలా అందుబాటులో ఉండి వాళ్లకి సహాయ సహకారాలు అందించడమే మా ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. ప్రత్యేకంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొనడం జరిగింది.

రేపు ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ రాక

మదనపల్లె అర్బన్: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ బుధవారం మదనపల్లెకు విచ్చేస్తున్నట్లు, భారతీయ అంబేడ్కర్ సేన వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ తెలియజేశారు. సోమవారం స్థానిక బాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుండి స్థానిక మిషన్ కాంపౌండ్ వద్దగల సిఎస్ఐ కమ్యూనిటీ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. బాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకలకు ఎస్సీ కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా, మదనపల్లె ఎమ్మెల్యే నవాజ్ బాషా విశిష్ట అతిథిగా హాజరవుతారని తెలిపారు. అంబేడ్కర్ ధర్మపత్ని సింబల్ ఆఫ్ శాక్రిఫైస్ మాతా రమాబాయి 125 జయంతి వేడుకలు ఈ ఏడాదంతా ఘనంగా నిర్వహించాలని తీర్మానించడం జరిగిందని, ఇందులో భాగంగా మహిళా దినోత్సవం రోజున భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) ఆధ్వర్యంలో, మాతా రమాబాయి అంబేడ్కర్ అవార్డ్స్ ఫంక్షన్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. ప్రతిభా వంతులైన కొంత మంది విద్యార్థులను, వివిధ రంగాలలో మహిళలకు సేవందిస్తున్న మరికొందరు ప్రముఖులనూ ఈ ఫంక్షన్ లో మాతా రమాబాయి అవార్డ్స్‌తో సత్కరించి, జ్ఞాపికలను అందజేయడం జరుగుతుందన్నారు. స్త్రీ వాదులు, మహిళా సంఘాల ప్రతినిధులు, అంబేడ్కరిస్టులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వేడుకలను విజయవంతం చేయాలని శివప్రసాద్ పిలుపునిచ్చారు. సమావేశంలో రిటైర్డ్ ఎంఇఒ ప్రజాకవి పోతబోలు రెడ్డెప్ప, రిటైర్డ్ డిప్యూటీ జైలర్ బురుజు లక్ష్మీనారాయణ, కె.వి.రమణ, బాస్ స్టేట్ కన్వీనర్ యు.గణపతి, జిల్లా కన్వీనర్ ముత్యాల మోహన్, జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ కలలను సాకారం చేయాలి

ప్రజాశక్తి-గాలివీడు

ప్రతి విద్యార్థినీ కస్తూరిబా గాంధీ కలలను సాకారం చేయాలని వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణ్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్య కోసం ఎంతో కృషి చేశారని చెప్పారు. ఆమె సేవను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ అంకితభావంతో చదువుకుని వృద్ధిలోకి రావాలని పిలుపునిచ్చారు. వైసిపి మైనార్టీ నాయకుడు ఖాదర్ మోదీన్ మాట్లాడుతూ 2006 నుంచి మండల కేంద్రంలో బాలికలకు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు కస్తూరిబా పాఠశాలలో విద్యనందిస్తున్నారని చెప్పారు. కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను సహకారం చేయాలని అని పేర్కొన్నారు బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓ నిర్మల మాట్లాడుతూ పాఠశాల విద్య ఎంతో విలువైందని చెప్పారు. మంచి అలవాట్లు, ఆలోచనతో ముందుకు సాగితే భవిష్యత్తులో బావుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సుబ్బలక్షుమ్మ, ఎఎన్ఎం జ్యోతి, వైసిపి నాయకులు అరవీటి సుధాకర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు సౌజన్య, శ్వేత, విమల, రాజేశ్వరి, మౌనిక, శకుంతల, జయమ్మ, లక్ష్మీదేవిప పరిమళ రెడ్డమ్మ, అరుణమ్మ విద్యార్థినిలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపిపి యధుభూషణ్‌రెడ్డి

లోకేష్‌ను విమర్శించడం సరికాదు

ప్రజాశక్తి - రాయచోటి

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబును రాయచోటికి చెందిన వైసిపి నాయకులు విమర్శించడం సరికాదని టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాదరవల్లి పేర్కొన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయనమాట్లాడుతూ యువగళం పాదయాత్రలో లోకేష్ బాబు ఎక్కడా కూడా రాయచోటిని జిల్లా లేకుండా చేస్తాం అని ప్రకటించలేదని పేర్కొన్నారు. మదనపల్లిను అదనంగా జిల్లా చేస్తామని చెప్పారే తప్ప, ఇప్పుడున్న అన్నమయ్య జిల్లాను పూర్తిగా రద్దు చేస్తామని ప్రకటించలేదని పేర్కొన్నారు. కొందరు వైసిపి నాయకులు అవగాహనా రాహిత్యంతో ఇష్టారాజ్యంగా మాట్లాడడం తగదన్నారు. విమర్శలు చేసే వైసిపి నాయకులు స్థాయికి తగ్గట్టు మాట్లాడితే మంచిదిని పేర్కొన్నారు. రాయచోటి మున్సిపాలిటీలో చేసిన అభివృద్ధి గురించి చెప్పుకోవడం చేతకాక వైసిపి బుడ్డా నాయకులు, అనవసరంగా నారా లోకేష్ పై విమర్శలు చేస్తూ పబ్బం కడుక్కుంటున్నా రుని విమర్శించారు. ఇప్పటికైనా ఆరోపణలు మానుకొని రాయచోటి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు , మాజీ మండల ఉపాధ్యక్షులు అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి, పెమ్మాడపల్లి సర్పంచ్ వాసు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో విజేతలైన విద్యార్థులతో నిర్వాహకులు

పిల్లలకు చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్ అవసరం

ప్రజాశక్తి-పీలేరు

నేటి సమాజంలో పిల్లలకు చదువుతో పాటు మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని, దీనివల్ల మానసిక, శారీరక దృఢత్వంతో పాటు ఆత్మరక్షణ కలుగుతుందని పీలేరు యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ జి.ఇనాముల్ హక్ తెలిపారు. సోమవారం పీలేరు పట్టణ శివారులోని వడ్డీపల్లిలో ఉన్న కళ్యాణ మండపంలో ఈ కరాటే పోటీలు జరిగాయి. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి సుమారు 400 మంది కరాటే విద్యార్థులు, కరాటే మాస్టర్లు పాల్గొన్నారు. మదనపల్లి యోధా అకాడమీ మాస్టర్ ఎం.ఎ.సతీష్ యోధ, పీలేరు యోధ అకాడమీ జి.ఇనామిల్ హక్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. మదనపల్లికి చెందిన ఇస్మాయిల్, ఖాదర్, శ్రీనివాసులు, మురళీ, ఎం.ఎ.సతీష్, నరేష్, అమర్, ఫాహీం, మహిత, పి.సతీష్, హర్ష, తిరుపతి నుంచి పట్టాభి, సత్యవేడు సతీష్, పుంగనూరు నుంచి కేశవ, మన్సూర్, ఉమర్, బంగారుపాలెంకు చెందిన సురేంద్ర బాబు, తిరుపతి సోమశేఖర్, కదిరి నుంచి అక్బర్ అలి, మనోజ్ పుంగనూరు నుండి మాస్టర్లు, టీంలు పాల్గొన్నాయి. యోధ ఓపెన్ కటాచ్ ఛాంపియన్షిప్ లో పి. సతీష్ మొదటి బహుమతిని. యోధా ఓపెన్ ఫైట్ ఛాంపియన్షిప్‌లో తిరుపతి విద్యార్థి ప్రేమ్ మొదటి బహుమతిని, మదనపల్లి నుంచి వచ్చిన ఇన్స్పెక్టర్ పి. సతీష్ రెండవ స్థానంలో నిలిచారు. సూపర్ కిడ్స్ ఈవెంట్లో హదియ రోషిని గోల్డ్ మెడల్, సీనియర్ సూపర్ కిడ్స్ ఈవెంట్లో నుహ రోషిని గోల్డ్ మెడల్ సాధించారు. పలువురు విద్యార్థులు కట, టీమ్ కట, కుమ్మితే విభాగాల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. పోటీలను విజయవంతం చేసిన కరాటే విద్యార్థులు, మాస్టర్లకు పీలేరు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

పేదల జీవనోపాదులు మెరుగుపడేలా కృషి

ప్రజాశక్తి- వీరబల్లి

పేదల జోవనోపాదులు మెరుగుపడేలా కృషి చేయాలని ఎపిఎం ఖాదర్‌వలి అన్నారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సమాఖ్యల సిబ్బంది సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వయం సహాయక సంఘాలకు వివిధ సంస్థల ద్వారా కల్పించే రుణాలతో వారి స్థిరమైన జీవనోపాదులకు అవసరమైన మార్గాలపై అవగాహన కల్పించాలని కోరారు. వారికిష్టమైన జీవనోపాధిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సకాలంలో అన్ని రకాల ఆర్థిక లావాదేవీలపై అవగాహనతో పుస్తక నిర్వహణ చేయాలన్నారు. సమావేశాల ద్వారానే సమాఖ్యల బలోపేతం అవుతాయన్నారు. మంలో మండల, గ్రామ సమాఖ్యల సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు

సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో ఈనెల 31 నుంచి ఏప్రిల్ 8 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో వివిధ విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం విజిలెన్స్ అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి టిటిడి పరిపాలన భవనంలో ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాల నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ ఏప్రిల్ 5న శ్రీ కోదండరామస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు ప్రారంభించాలన్నారు. కల్యాణానికి పెద్దసంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వైఎస్ఆర్ జిల్లా అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని టిటిడిలోని అన్ని విభాగాల అధికారులు సమర్థవంతంగా పని చేయాలన్నారు. భక్తుల సంఖ్యకు సరిపడా తాగునీరు, మజ్జిగ పంపిణీకి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. స్వామివారి కల్యాణం అనంతరం ప్రతి భక్తుడికీ అక్షింతలు, కంకణాలు, పసుపు కుంకుమ అందేలా ఏర్పాట్లు చేపట్టాలని ఆలయ అధికారులకు సూచించారు. పుష్పాలు, విద్యుత్ అలంకరణలతో కల్యాణవేదికను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. బ్రహ్మోత్సవాల్లో నిర్వహించే వాహనసేవల ముందు, కల్యాణవేదికపై అద్భుతమైన కళాప్రదర్శనలు ఏర్పాటు చేయాలని హెచ్‌డిపిపి అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాల పోస్టర్లు, బుక్‌లెట్లు త్వరగా ముద్రించి విస్తృతంగా ప్రచారం చేయాలని చెప్పారు. బ్రహ్మోత్సవాలు, ప్రత్యేకించి కల్యాణోత్సవం రోజున భక్తులకు చిన్నపాటి ఇబ్బంది కలిగినా తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించేలా కంట్రోల్ రూమ్ పని చేయాలన్నారు. డిప్యుటేషన్ సిబ్బందికి అన్నప్రసాదాలు, వసతి ఏర్పాట్లపై ముందస్తుగా ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఆలయ పరిసర ప్రాంతాలతోపాటు కల్యాణవేదిక ప్రాంగణంలో అవసరమైనన్ని ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేయాలని, గ్యాలరీల్లో కూర్చునే భక్తులకు ఎండవేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు తగినన్ని కూలర్లు ఏర్పాటు చేయాలన్నారు. క్యూలైన్లు, అన్నప్రసాదాల పంపిణీకి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు కోసం వైఎస్ఆర్ జిల్లా అధికారులతో కలిసి ప్రణాళికలు రూపొందించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా వాహనాల పార్కింగ్ కోసం తగినన్ని ప్రదేశాలు సిద్ధం చేయాలన్నారు. ప్రత్యేక వైద్య బృందాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు, మందులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమీక్షలో ఎస్‌విబిసి సిఇఒ షణ్ముక్ కుమార్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, సిఇఒ శేషశైలేంద్ర, ఆలయ డిప్యూటీ ఇఒ నటేష్‌బాబు, డిఎఫ్‌వో శ్రీనివాస్, అదనపు ఆరోగ్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికలలో విజయం సాధించిన మజ్దూర్ యూనియన్ నాయకులు

రైల్వే ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్ విజయం

ప్రజాశక్తి-నందలూరు

నందలూరు రైల్వే కేంద్రంలో నిర్వహించిన రైల్వే ఇనిస్ట్యూట్ ఎన్నికలలో రైల్వే మజ్దూర్ యూనియన్ ఘన విజయం సాధించింది. ఈ ఎన్నికలలో రైల్వే మజ్దూర్ యూనియన్, రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ మధ్య జరిగిన హెూరాహెూరీ పోటీలో మజ్దూర్ యూనియన్‌కు సంబంధించిన సభ్యులందరూ గెలుపొంది రైల్వే ఇన్స్టిట్యూట్‌ను తిరిగి కైవసం చేసుకున్నారు. ఈ ఎన్నికలలో రైల్వే మజ్దూర్ యూనియన్ తరపున ఇన్స్టిట్యూట్ సెక్రటరీగా కె.విశ్వనాథ్, జాయింట్ సెక్రటరీగా ఎం.శ్రీహర్ష, ట్రెజరర్‌గా మోర్త శ్రీనివాసులు లతోపాటు డైరెక్టర్స్‌గా రాజా, జె. వంశీకృష్ణ, ఎస్‌కె.అబ్దుల్ రౌఫ్, టి.బాలసుబ్రమణ్యం, షేక్ మహమ్మద్, ఎస్.నరసింహులు మొత్తం ప్యానల్ సభ్యులందరూ ఘన విజయం సాధించారు. ఎన్నికల అనంతరం వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన యూనియన్ నాయకులు, సభ్యులు గెలుపొందిన వారిని పూలమాలలతో సత్కరించి భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

చెరువులకు వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు, సర్పంచ్

చేపల చెరువు వేలంలో రూ.26 వేలు ఆదాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

చేపల చెరువుల వేలం ద్వారా రెడ్డివారిపల్లె, సామకోటవారిపల్లె పంచాయతీలకు రూ.26 వేలు ఆదాయం సమకూరినట్లు ఎంపిడిఒ లీలామాధవి తెలిపారు. సోమవారం రెడ్డివారిపల్లి సర్పంచ్ రెడ్డెమ్మ నరేంద్రరెడ్డి, సామకోటవారిపల్లి సర్పంచ్ మహాదేవ రెడ్డి ఆధ్వర్యంలో చేపల ఫలసాయానికై చెరువులకు వేలంపాటను నిర్వహించడం జరిగిందన్నారు. రెడ్డివారిపల్లి పంచాయతీలోని చెరువులకు వేలంపాటను నిర్వహించగా రూ.17,500, సాముకోటివారి పల్లిలోని వీరరాఘవుల చెరువు, చవటరాజు కుంట చెరువులకు మరల (రెండవసారి) వేలం పాటను నిర్వహించగా రూ.9 వేలు, మొత్తంగా రూ.26,500 రెండు పంచాయతీలకు ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ ఆదాయాన్ని పంచాయతీ అభివ ృద్ధికి ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక ఆహ్వానితులు నరేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గాయత్రి, యర్రమల్లయ్య నాయుడు, మంజుల, నాగమల్లి పాల్గొన్నట్లు తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ఇప్పటం ప్రజలను వేధించడం సరికాదు : జనసేన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

గుంటూరు జిల్లాలోని ఇప్పటం ప్రజలు జనసేన పార్టీకి మద్దతుగా ఉన్నారన్న కారణంగా అధికార పార్టీ రోడ్ల విస్తరణ పేరుతో వారిని వేధించడం సరికాదని రాజంపేట జనసేన నాయకులు తెలియజేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చాక సామాన్యులపై విరుచుకు పడుతోందని ఆరోపించారు. ఇది ప్రజాస్వామ్య పాలనా లేక రాక్షస పాలనా అని ప్రశ్నించారు. పేదలకు అండగా ఉంటున్న జనసేన పార్టీకి మద్దతు పలుకుతున్న ప్రజలపై వైసీపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం సమంజసం కాదని అన్నారు. ఇప్పటం ప్రజలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం జనసేన నాయకులను ఎంత అనగదొక్కాలనుకుంటే బంతిలాగా తిరిగి అంత వేగంగా పుంజుకుంటారని అన్నారు. ఇకనైనా కక్షసాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో జనసేన పార్టీ లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కత్తి సుబ్బరాయుడు, నాయకులు భాస్కర పంతులు, వెంకటయ్య, భువనగిరి పల్లె శంకరయ్య, వీరయ్య ఆచారి, బండ్ల రాజేష్, పోలిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని డాక్టర్ జులేఖ బేగం అన్నారు. మదనపల్లి లయన్స్ కంటి ఆసుపత్రి, ఐటెల్ గ్రూపు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం ఉదయం 9:30 గంటల నుంచి 12.30 గంటల వరకు వైద్యులు డాక్టర్ నివేదిత ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారన్నారు. మండలంలోని ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

ఒఆర్ఎస్ కేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రమైన నిమ్మనపల్లి వారపుసంత వద్ద ఒఆర్ఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖ బేగం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఎండల తీవ్రత ఎక్కువ అవుతున్న నేపథ్యంలో చిన్నపిల్లలు, వయసు పైబడిన వృద్ధులు వడదెబ్బకు గురి అయ్యే అవకాశం ఉన్నందున వారపు సొంత వద్ద ఓ.ఆర్.ఎస్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎండలో ఎక్కువగా తిరగడం వలన శరీరంలోని నీరు చెమట రూపంలో బయటకు వెళుతుందని, తద్వారా ఆ వ్యక్తి డిహైడ్రేషన్‌కు గురై సొమ్మసిల్లి పడిపోవడం జరుగుతుందన్నారు. ఎండ తీవ్రతను తట్టుకోవడానికి తరచూ కాటన్ దుస్తులు ధరించాలని, నిమ్మరసం, మజ్జిగ, పుచ్చకాయలు, దోసకాయలు, ఖర్జూరం ఇలాంటివి వేసవిలో అధికం గా తీసుకోవడం వలన ఎండ తీవ్రతను తట్టుకొని ఆరోగ్యంగా ఉండవచ్చని ప్రజలకు సూచించారు. వృద్ధులకు ఒఆర్ఎస్ ద్రావణం కలిపిన నీరును పంపిణీ చేశారు. ప్రజలు ఈ ఒఆర్ఎస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ రామచంద్ర, సిహెచ్ఒ మల్లిక, పిహెచ్ఎన్ సరోజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒఆర్ఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖ బేగం

క్రీడా మైదానం అభివృద్ధికి సహకరించాలి : 'మేడా'

మైదానంలో ప్రహరీ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మేడా విజయశేకర్‌రెడ్డి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని అరవపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధికి అందరూ సహకరించాలని, పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేయాలని రాజంపేట నియోజకవర్గం యువ నాయకులు మేడ విజయ శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం క్రీడా మైదానంలో కూలి పోయిన ప్రహరీ గోడలు తిరిగి చేపడుతున్న నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అరవపల్లె ప్లే గ్రౌండ్ యూత్ అధ్యక్షుడు పల్లె గ్రీస్మంత్ రెడ్డి, సభ్యులతో ఆయన మాట్లాడుతూ పార్టీలతో ప్రమేయం లేకుండా క్రీడామైదానం అభివృద్ధికి పలువురు సహకరించడం హర్షించదగ్గ విషయం అన్నారు. అభివృద్ధి పనులు చేపడుతున్న గ్రౌండ్ యూత్ సభ్యులను అభినందిస్తూ, చేపట్టిన తాత్కాలిక పనులన్నీ పూర్తి చేయాలని, అందుకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. సబ్ సెంటర్ క్రీడాకారులు తన ద ృష్టికి తెచ్చిన క్రీడాకారుల డ్రెస్సింగ్ రూమ్, బాత్రూములు నిర్మాణానికి తప్పనిసరిగా ఆర్థిక సహాయాన్ని అందజేసి సెంటర్ అభివృద్ధికి, క్రీడాకారులకు సదుపాయం కల్పించేందుకు క ృషి చేస్తానన్నారు. అనంతరం క్రీడా మైదానంలో ఏర్పాటుచేసిన కబడ్డీ కోర్టును కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లె గ్రీష్మంత్ రెడ్డి మాట్లాడుతూ తొలుత విజయ శేఖర్ రెడ్డి హామీ ఇచ్చి పనులు మొదలెట్టడంతో స్వఛ్ఛందంగా పసుపులేటి ప్రవీణ్, మేస్త్రి వెంకటసుబ్బయ్య,డాక్టర్ అరిగే రాంప్రసాద్, బుచ్చిరెడ్డి, కుర్ర మణి యాదవ్, తదితరులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ ఆర్థిక సహాయాన్ని అందజేసి, అభివృద్ధికి తోడ్పాటు అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి నాయకులు భాస్కర్, గ్రౌండ్ యూత్ సభ్యులు ముమ్మడిశెట్టి సుధాకర్, పుత్త శంకర్, జగన్, శివకోటి, పెంచలయ్య, రాంప్రసాద్, మాధవయ్య,విజయ్ కుమార్,ఫరీదు,రంజిత్, కనకయ్య, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

అధిక దిగుబడులకు సేంద్రియ ఎరువులు మేలు : ఎడిఎ

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

పంట సాగు చేసే ముందు పోషకాలు కూడిన సేంద్రియ ఎరువులు రైతులు వాడితే అధిక దిగుబడులు పొందవచ్చు అని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు జయరాణి పేర్కొన్నారు. సోమవారం అప్పకొండయ్యగారిపల్లిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట సాగు చేసేటప్పుడు కచ్చితంగా భూములు భూసార పరీక్షలు చేసి ప్రకృతి ఎరువులను వాడాలన్నారు పంట సాగు చేసి కోతకు వచ్చేవరకు పొలాన్ని రైతు గమనించాలన్నారు. ప్రస్తుతం మండలంలో వేరుశనపంట దిగుబడి బాగా వచ్చిందని పంట కూడా ఆశాజనకంగా ఉందని ప్రకృతి ఎరువులు వాడక వల్ల మంచి దిగుబడులు వస్తాయని ఆమె సూచించారు. ప్రతి రైతు శిక్షణ పొంది ఇతర రైతులకు తెలియ జేయాలని పేర్కొన్నారు. మన చుట్టూ ఉండే ఆకులతో కషాయాలు తయారు తయారు చేసుకోవచ్చన్నారు. ఘన ద్రువ జీవామృతం పొలానికి వాడడం వల్ల చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. తక్కువ ఖర్చుతో మంచి ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కాంతమ్మ, సిబ్బంది సరస్వతి, నాగార్జున, చంద్రమోహన్‌రెడ్డి, గంగిరెడ్డి,

వేరుశనగ పంటలో పొలంబడి నిర్వహిస్తున్న ఎడిఎ జయరాణి

సాహిర్‌భాష, నాగమణి, లక్ష్మీదేవి, అంజనమ్మ, వీరారెడ్డి, రామాంజులమ్మ, రెడ్డయ్య, వెంకటరమణ, రాజేష్, మల్లికార్జున, అప్పకొండయ్యగారిపల్లి రైతులు పాల్గొన్నారు

అసమర్థపాలనను సాగనంపుదాం : ఆర్ఆర్

ప్రజలతో మాట్లాడుతున్న రమేష్ కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

రాష్ట్రంలో అసమర్థ పాలనను సాగిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని మాజీ ఎంఎల్‌ఎ రమేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నమండెం, దేవగుడిపల్లెల్లో టిడిపి ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరుగుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో జగరుతున్న అవినీతి, అక్రమాల గురించి ప్రజలకు వివరించారు. గడిచిన మూడేళ్లలో రాష్ట్రంలో సామాన్యులకు, మహిళలకు రక్షణ లేకుండా పోయందని వాపోయారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అవినీతి, అక్రమాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, విద్యుత్ ఛార్జీలు, చెత్తపన్ను, ఇంటి పన్ను విపరీతంగా పెంచేసి సామాన్యుల నడ్డి విరుస్తున్నారని చెప్పారు. ఏ వర్గానికీ ఎటువంటి ఉపయోగం లేకుండా పాలనను సాగిస్తున్న వైసిపిని అందరూ ఇంటికి పంపించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి బాకివుల్లాఖాన్, గ్రామ అధ్యక్షులు సిరాజ్ అలీఖాన్, బెల్లం నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడుకుందాం

ప్రజాశక్తి - వీరబల్లి

అంతరించిపోతున్న వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యంత అందరిపై ఉందని అటవీశాఖ రేంజ్ అధికారి స్ఫూర్తి పేర్కొన్నారు. సోమవారం వన సంరక్షణ సమితి అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు, రైతులకు, విద్యార్థులకు అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా ఆమెతోపాటు డిఎఫ్ఒ నాగమనేశ్వరి హాజరై మాట్లాడారు. అటవీ సంరక్షణ గురించి విద్యార్థులను, రైతులను అడిగి తెలుసుకున్నారు. జీవవైవిధ్యం ఉంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. మనుషులతోపాటు వన్యప్రాణులు సైతం బాగుండాలని కోరుకుంటూ అడవులను కాపాడుకోవాలన్నారు. పక్షులను, జంతువులను రక్షించుకునేందుకు అటవీశాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెట్లను కాపాడుకుంటే వర్షాలు కురిసి భూగర్భజలం పెరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ప్రతి వేసవిలో ఆకులు వట్టిపోయి నేలరాలుతాయి. మంటలు అంటుకునే అవకాశం ఉన్నందున రోడ్డు మార్గాన వెళ్లే బాటసారులు, వాహన దారులు కాల్చిన బీడీలు, సిగిరెట్లను పడయరాదని సూచించారు. దీనిపై ఆయా గ్రామాల ప్రజలకు అటవీశాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. అడవికి నిప్పు మానవాళికి ముప్పు అని, అడవులను కొంతమంది స్వార్థం కోసం అడవులను నాశనం చేస్తున్నారని, ప్రపంచ జీవకోటికి అడవులు ఆక్సిజన్, అనేక రకాల ఔషధాలు అందిస్తుందని పేర్కొన్నారు. అడవులు ప్రతి ఏటా అగ్ని ప్రమాదానికి గురై వందల హెక్టార్ల సంఖ్యలో ధ్వంసమౌతున్నాయన్నారు. అడవులను, జంతువులను కాపాడుకోవడం మానవాళి భాధ్యతగా మెలగాలన్నారు. వేసవికాలంలో జంతువులు, పక్షుల దాహార్తి తీర్చేందుకు , ఇంకుడు, నీటినిల్వ గుంతలు ఏర్పాటు చేసి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతామన్నారు. అడవికి నిప్పు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం స్థానికులు అతిథులను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రఘు శంకర్, ఎఫ్‌బిఒ రఘుపతి రాజు, కంప్యూటర్ ఆపరేటర్ రవీంద్ర, మున్నా, గాయత్రి, మహబూబ్ బాషా, నాగరత్నమ్మ, ఆర్ రెడ్డప్ప, కృష్ణ ప్రసాద్, ప్రొడక్షన్ సిబ్బంది, విఎస్ఎస్ సభ్యులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్రలో 'సుగవాసి'

ప్రజాశక్తి రాయచోటి

అన్నమయ్య జిల్లా పీలేరు నియోజకవర్గం వేపులబయలు నుంచి సోమవారం ప్రారంభమైన టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ పాదయాత్రలో టిటిడి మాజీ పాలకమండలి సభ్యులు, రాయచోటి టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ చేపడుతున్న పాదయాత్రలో ప్రజలు ప్రజలు నిరాజనం పడుతున్నారని తెలిపారు. లోకేష్ పాదయాత్రను చూసి ఓర్వలేక వైసిపి నాయకులు అనేక ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలో రావాలన్నారు. 2024లో నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి జెండా ఎగురవేస్తామన్నారు.

ప్రతి వర్షపు నీటి బొట్టునూ కాపాడుకోవాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి వర్షపు నీటి బొట్టును కాపాడుకోవాలని అప్పుడే మన భవిష్యత్ తరాలకు నీటిని అందించగలమని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ పేర్కొన్నారు. సోమవారం స్థానిక రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ వాటర్ మిషన్ మినిస్ట్రీ ఆఫ్ జల్ శక్తి ఆదేశాల మేరకు నెహ్రూ యువ కేంద్ర అధ్వర్యంలో క్యాచ్ ది రైన్ అనే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగావిచ్చేసిన జిల్లా యువ అధికారి మాట్లాడుతూ రాబోయే రోజులో ప్రతి వర్షపు నీటి బిందువును కాపాడుకోవాల్సిన అవసరమెంతైనా ఉందని చెప్పారు. అనంతరం డ్వామా ఎపిఒ బాల మునెయ్య మాట్లాడుతూ వర్షపు నీటిని నిల్వ చేసికొనే అనేక పద్ధతుల ద్వారా మనం భూగర్భ నీటిని పెంచే అవకాశాలున్నాయని తెలిపారు. క్యాచ్ ది రెయిన్ అనే కార్యక్రమం ద్వారా యువతకు తమ బాధ్యతను గుర్తు చేశామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ మునెయ్య మాట్లాడుతూ ఇంటి ఆవరణంలో ఇంకుడు గుంతలు తవ్వడం వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోకుండా చేయగలమని అన్నారు. వీరబల్లి రూరల్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు ప్రయత్నంగా వర్షపు నీటిని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వర యూత్ డెవలప్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు సోమల వెంకటేశ్వర, కార్యక్రమంలో విద్యార్థులు, యువ కేంద్ర సేవ కార్యకర్తలి బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుంటే అన్ని రంగాల్లో రాణించొచ్చు

ప్రజాశక్తి-పెద్దమండ్యం

చదువు ఉంటే అన్ని రంగాలలో విజయం సాధించవచ్చు అని ఎంఈఓ మనోహర్ పేర్కొన్నారు. సోమవారం సిద్దవరం కస్తూర్బా గురుకుల పాఠశాలలో పదవ తరగతికి, ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థులకు ఫేర్వెల్ ఫంక్షన్ ఏర్పాటు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెద్దమండ్యం ఎస్ఐ వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పరీక్షకు పదవ తరగతి మార్కులు ముఖ్యమని అందువలన ప్రతి ఒక్కరూ అత్యధిక మార్కులు సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎస్ఓ కుమారి, సర్పంచ్ విజయకుమారి, పాఠశాల విద్యాకమిటీ చెర్మెన్ మస్తానమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- కురబలకోట

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలని తంబళ్లపల్లె నియోజకవర్గం ఇన్‌ఛార్జి జి.శంకరయాదవ్ పిలుపునిచ్చారు. పాదయాత్ర ఈ నెల 10న మదనపల్లె నియోజకవర్గం పూర్తి చేసుకుని అదే రోజు సాయంత్రం తంబళ్లపల్లె నియోజకవర్గంలోకి చేరుకుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమిరెడ్డి, ఎల్లారెడ్డి, వైజీ రమణ, డి.ఆర్.వెంకట్రమణారెడ్డి, సురేంద్ర, రెడ్డిశేఖర్, శివారెడ్డి, లక్ష్మన్న, తిమ్మరాయుడు, రెడ్డెప్పనాయుడు, శ్రీనివాసులు, మల్లికార్జున, రమణ, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** టిడిపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మదనపల్లి నియోజకవర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ స్థాయిలో తరలివచ్చి పాదయాత్రను విజయవంతం చేయాలని నిమ్మనపల్లి తెలుగుదేశం మండలాధ్యక్షులు పుర్రా వెంకటరమణ, మండల తెలుగు యువత అధ్యక్షులు చిన్నబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరత్నం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగు యువత మండలాధ్యక్షులు చిన్నబాబు, మండల ప్రధాన కార్యదర్శి మురళి మోహన్, విజయ్,గోపి, చంద్రాయుడు, జగన్మోహన్ రెడ్డి,శంకర, శ్రీధర్‌రెడ్డి, మాబులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** ఈ నెల 8, 9, 10 తేదీలలో జరిగే నారా లోకేష్ యువగళం పాదయాత్రకు ముస్లిం మైనార్టీలు పెద్ద ఎత్తున తరలిరావాలని టిడిపి మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.ఎ.మస్తాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.యం.రఫీ, టిడిపి రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ పిలువు నిచ్చారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ముస్లిం సోదరులు పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షులు నిసార్ అహ్మద్,పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సికిందర్, ముక్తియార్, కే.మస్తాన్,తౌఫీక్, దాదూ, తాజ్ బాషా పాల్గొన్నారు.


కురబలకోట : మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్

మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులు మీడగ వెంకటేశ్వర్‌రెడ్డి, పొక్కింటి బాబురెడ్డిని గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. సోమవారం స్థానిక ఎస్‌టియు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మేధావుల సభకు మేధావులనే పంపాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, సిఐటియు జిల్లా గౌరవాధ్యక్షులు హరీంద్రనాథ్ శర్మ, జిల్లా ఉపాధ్యక్షులు డి.ప్రభాకర్‌రెడ్డి, ఎఐటుయుసి అన్నమయ్య జిల్లా కార్యదర్శి సాంబశివ, ఎఐటుయుసి నాయకులు టి.కృష్ణప్ప, మురళి పాల్గొన్నారు.

అన్నదానంలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

ఆశ్రమ విద్యార్థులకు అన్నదానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

పట్టణంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మదనపల్లి పట్టణం, బసినికొండ వద్ద గల కూరపర్తి సాయి చైతన్య స్రవంతి ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ నందు విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎల్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏడాది పుట్టినరోజు వేడుకలను నిరాడంబరంగా జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. ఈ ఏడాది చైతన్య స్రవంతి ఆశ్రమ విద్యార్థుల మధ్య పుట్టినరోజు వేడుకలు జరుపుకొని,వారికి ఒక్కపూట భోజనానికి తనవంతు సహకారం అందించానన్నారు. పుట్టినరోజు వేడుకలను గొప్పగా జరుపుకోవడం వల్ల ధనం వృథాకావడం తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. ఆ డబ్బుతో చాలామంది నిరుపేదలు, అనాథలకు ఒక్క పూట ఆకలి తీర్చిన సార్థకం ఉంటుందన్నారు. అనంతరం ఆశ్రమ విద్యార్థులు ఎల్.ప్రసాద్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - పుల్లంపేట

మండల పరిధిలోని ఆర్.వడ్డేపల్లిలో సోమవారం నియోజకవర్గ క్రికెట్ పోటీలను పసుపులేటి వెంకటరమణ, పిఎస్.మణి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన టీములకు మొదటి బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.పది వేలు అందజేస్తామన్నారు. ప్రతి మ్యాచ్ అనంతరం మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందజేస్తామని తెలిపారు. మొదటి మ్యాచ్ వెంకట రాజంపేట రాయల్స్-11, మల్లూరుపల్లి సమర-11గా మధ్య జరిగింది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన సమర-11 జట్టు 9.2 ఓవర్లలో 44 పరుగులకు ఆలౌట్ అయింది. చేదనలో వెంకట రాజంపేట రాయల్స్-11 జట్టు 4.3 ఓవర్లలోనే మూడు వికెట్లు నష్టపోయి ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచిన వసీం ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

60 ఏళ్లు పైబడిన వారికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి- కలకడ

మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఆధ్వర్యంలో జవహర్‌బాబు 60 ఏళ్లు పైబడిన వారికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్లలో భయపడిన వారందరికీ బిపి, షుగరు వ్యాధుల వలన కంటి చూపు లోపిస్తుందని ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని తీసుకునే ఆహార పద్ధతులు నియమాలు పాటించాలని పోషకాహారాలు కలిగినటువంటి ఆహారాన్ని తీసుకోవాలని వారు తెలియజేశారు. 48 మందికి వైద్య పరీక్షలు నిర్వ హించి మందులు పంపిణీ చేయడమైనది. కంటి చూపు లోపించిన నలుగురిని గుర్తించి సర్జరీ చేయు నేత్రాలయాలకు తిరుపతికి రెఫర్ చేశామన్నారు. 44 మందికి మందులు పంపిణీ చేశామన్నారు. వారికి ఉచిత కంటి అద్దాలు ఇచ్చేందుకు రిపోర్టు తయారు చేసి పంపామని తెలిపారు. పారామెడికల్ ఆఫీసర్ పరుశురాం పిఎంఒ మాట్లాడుతూ వైయస్సార్ మూడో విడత అవ్వతాతల కార్యక్రమంలో 60 ఏళ్లు పైబడిన వారందరికీ ఉచిత మందులు, కంటి అద్దాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ జయరామయ్య పీహెచ్ఎన్ శుభ రత్నమ్మ, సూపర్వైజర్ ముజీబ్ భాష ల్యాబ్ టెక్నీషియన్ జమీల్ అహ్మద్. ఫార్మసిస్ట్ షరీఫ్ భాష గణాంక అధికారి షేక్ ఇస్మాయిల్, స్టాఫ్ నర్స్ భారతమ్మ, ఆరోగ్య కార్యకర్త వాణి, ఆశా కార్యకర్తలు గురుశాంత, జై రమణమ్మ, పార్వతమ్మ, ఎఫ్ఎన్ఓ అలివేలు, మంగబాయి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతాశయంతో చదవాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

విద్యార్థులు ఉన్నత ఆశయంతో ప్రణాళికబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ప్రిన్సిపల్ హేమంత్ కుమార్ కోరారు. సోమవారం స్థానిక మోడల్ స్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలుతో పాటు పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో స్కూలు కమిటీ చైర్మన్ సలీం, అధ్యాపకులు, టీచర్లు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం : ఎంపిపి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని వడ్డించాలని జిల్లా ఎంపిపిల సంఘం అధ్యక్షులు మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలోని మధ్యాహ్న భోజనన్ని మాజీ ఎంపిపి రెడ్డయ్య, కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్ అమీర్, ఉప మండల అధ్యక్షుడు సమరసింహారెడ్డిలతో కలిసి పరిశీలించి, విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా రూపురేఖలను మార్చేశారన్నారు. విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి వంటి పథకాల ద్వారా విద్యార్థులకు విద్యా సామగ్రితోపాటు విద్యార్థుల తల్లిదండ్రుల ఖాతాల్లో నగదును జమ చేయడం జరుగుతుందన్నారు. పదవ తరగతి పరీక్షలలో మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులతోపాటు పాఠశాలల పేరును నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, ఉప సర్పంచ్ రాజారెడ్డి, ఎంపీటీసీ శంకర్ నాయుడు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి